## క్లుప్తంగా

### ప్రకృతిని రక్షించుకుందాం



మొక్కలు నాటుతున్న నాయకులు, ఉపాధ్యాయులు

దుబ్బాకటౌన్: ప్రకృతిని రక్షించుకుందాం.. భవిష్యత్‌ను కాపాడుకుందామని గజ్వేల్ లయన్స్ క్లబ్ స్నేహ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి అన్నారు. సోమవారం రాయపోల్ మండలం ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో మొక్కలు నాటి విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన పర్యావరణం అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ స్నేహ నాయకులు సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు స్వాతి, విద్యార్థులు తదితరులున్నారు.

### భాస్వరం కరిగించే బ్యాక్టీరియా



ఎరువుపై అవగాహన కల్పిస్తున్న పల్లవి

నంగునూరు(సిద్దిపేట): పొలంలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియాను అభివృద్ధి చేయడంతో పంటకు ఎంతో మేలు జరుగుతుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి అన్నారు. తోర్నాల ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ముండ్రాయిలో క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల సిరిసిల్ల విద్యార్థులకు పంటల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పల్లవి మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసిన నారు కట్టలను ముంచే పద్ధతిలో పీఎస్‌బీ ద్రావకంలో నానబెట్టి నాటు వేసుకోవాలన్నారు. రెండు కిలోల పీఎస్‌బీ ద్రావకాన్ని పశువుల ఎరుతో కలిపి చల్లడం ద్వారా భాస్వరాన్ని కరిగించే లక్షణం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు దాక్షాయని, అర్చన, గాయత్రి, సుమయ, అలేఖ్యరెడ్డి, రైతు కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాల పంపిణీ చేస్తున్న మురళీధర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని లద్నూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాసరి మురళీధర్‌రెడ్డి సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే పాఠశాలలో తన తండ్రి లక్ష్మారెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించారన్నారు. తన తండ్రి లక్ష్మారెడ్డి, తల్లి కృష్ణమ్మల జ్ఞాపకార్థం పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి అందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, కృష్ణా రెడ్డి, పద్మారెడ్డి, భూపాల్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గ్రంథాలయ నిర్వహణపై అవగాహన



హెచ్‌ఎం అశ్వినిని సన్మానిస్తున్న ఎంఈఓ

కొండపాక(గజ్వేల్): పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని మండల విద్యాధికారి(ఎంఈఓ) బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లి పాఠశాలల్లో గ్రంథాలయ నిర్వహణ తీరుపై ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలకు విద్యార్థులు అలవాటు పడేలా చూసుకోవాలన్నారు. పుస్తక పఠనం విలువ గురించి విద్యార్థులకు అర్థం చేయించాలని సూచించారు. శిక్షణలో బెస్ట్ పార్టిసిపెంట్‌గా నిలిచిన బొబ్బాయిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అశ్విని ఘనంగా సత్కరించారు. రిసోర్సు పర్సన్ సత్యకృష్ణ, సీఆర్పీ సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అంబులెన్స్‌ల్లో తనిఖీలు

హుస్నాబాద్: జిల్లాలో మొత్తం ఇరువై ఆరు అంబులెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈఎంఆర్ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్‌తో అనుసందానంతో సేవలందిస్తున్నట్లు ఆ సంస్థ అధికారి కిషోర్ తెలిపారు. పట్టణంలో సోమవారం రెండు 108 అంబులెన్స్‌లు, 102 అమ్మఒడి వాహనాన్ని తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని పరికరాలు, రికార్డులు, పనితీరును పరిశీలించారు. అనంతరం కిషోర్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. నాణ్యత విభాగంశాఖ తనిఖీ అధికారి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ సాహిద్, జిల్లా మేనేజర్ హరి రామకృష్ణ, పైలెట్ సతీశ్, ఈఎంటీ విష్ణు వర్ధన్ పాల్గొన్నారు.

# దోమల నివారణకు చర్యలేవీ?

- మూలనపడ్డ ఫాగింగ్ యంత్రాలు
- గ్రామాల్లో విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు



జనగామలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అక్కన్నపేట(హుస్నాబాద్): అసలే గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అంతంత మాత్రమే ఉంది. వర్షాకాలం వచ్చిందంటే ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ ఉండి, మురుగు కాలువలు నిండి కాలనీల్లో అధ్వానంగా మారుతాయి. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ, డయేరియా, చికున్‌గున్యా వంటి రోగాల బారిన పడుతుంటారు. ప్రజలను సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు వర్షాకాలంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వానకాలంలో ప్రత్యేకించి దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సి ఉంది. వానాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

#### నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు

వానాకాలంలో దోమల నివారణకు గతంలో పంచాయతీలు ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశాయి. నిధులు తక్కువగా ఉండే జీపీలు వేరే జీపీల నుంచి తీసుకుని వాడుకునేలా అధికారులు చర్యలు తీసుకునేవారు. గతేడాది వరకు ఆడపదడపా వాటి వినియోగం కనిపించినా ఈ యేదాది మాత్రం నామమాత్రంగా కూడా కనిపించడం లేదు. మండలంలో మొత్తం 38 గ్రామాలు ఉండగా దాదాపుగా 15 గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. ఒక్కొక్క దానికి రూ.40 వేల నుంచి రూ.60 వేలు నిధులు వెచ్చించారు. వాటి వినియోగంపై అవగాహన లేక పెట్రోల్, డీజిల్, లిక్విడ్ సమపాళ్లలో కలపకపోవడంతో తరుచూ పాడవుతున్నాయని తెలుస్తోంది. మళ్లీ మరమ్మత్తు చేయించాలంటే ఖర్చు భారీగా అవుతున్నట్లు సమాచారం. దీంతో గతేడాది పాడైపోయిన యంత్రాలు ఇప్పటివరకు మరమ్మత్తులకు నోచుకోలేదు. నిధులు లేమితో యంత్రాలు గ్రామ పంచాయతీ కేంద్రాల్లో మూలన పడ్డాయి.




కట్కూర్ పంచాయతీలో ప్యాకింగ్ చేసి ఓ మూలన పడేసిన ఫాగింగ్ యంత్రం

#### నిధుల లేమి

చాలా పంచాయతీలలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో గ్రామాలలో దోమలు విపరీతంగా పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిల్వ నీటి మడుగుల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

#### చర్యలు తీసుకుంటున్నాం..



గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో ప్రతి బుధవారం ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం. డ్రైడే నిర్వహణ, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. ఫాగింగ్ యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. పాడైన ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం.

\- భానోతు జయరాం, ఎంపీడీఓ

# కొత్త రేషన్‌కార్డులతో నెరవేరిన కల

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందిస్తున్న కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): రేషన్‌కార్డుల కోసం పదేళ్లుగా కంటున్న పేదల కల ఇప్పటికి నెరవేరిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక సీఎస్‌హెచ్ గార్డెన్స్‌లో సోమవారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన కొత్త రేషన్‌కార్డులు, సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రేషన్‌కార్డులు ఇచ్చారని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే కొత్త కార్డులు మంజూరయ్యాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలను పట్టించుకోలేదని ఆరోపించారు. మండలంలో రెండు విడతల్లో 901 రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, పోచయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన బాలికల పాఠశాలలో రూ.7.15 లక్షలతో నిర్మించనున్న నూతన భవిత కేంద్రానికి, అలాగే రామసాగరంలో నూతన పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా వాటర్‌ట్యాంక్, దాచారంలో నూతన పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం పాఠశాలలో వంటశాలతోపాటు సీసీ రోడ్లు ప్రారంభించారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్



మాట్లాడుతున్న సీఐటీయూ నేత భాస్కర్

తొగుట(దుబ్బాక): గత ఎన్నికల సమయంలో పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం మండల స్థాయి పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. 60 యేళ్లు నిండిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు అందజేయాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని, కార్మికులకు కనీస వేతనాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల వేతనాలు మంజూరు చేస్తే పంచాయతీ కార్యదర్శులు కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు ఏడాదికి రెండు జతల యూనిఫామ్స్ అందించాలని నిబంధన ఉన్నా సకాలంలో అందించడంలేదని వాపోయారు. చెప్పులు, నూనె, గ్లౌజులు, సబ్బులు, కనీస వసతులు అందించకుండా కార్మికులకు ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా భిక్షపతి, కార్యదర్శిగా మాణిక్యం, సహాయ కార్యదర్శులుగా పోశయ్య, అక్కవ్వ, స్వామి, సాయిలు, కనకరాజు, కోశాధికారిగా ప్రభాకర్ తదితరులను నియమించారు.

# కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

వ్యవసాయ అధికారి మల్లేశం



రికార్డులు పరిశీలిస్తున్న మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలో యూరియా కృత్రిమ కొరత సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేశం హెచ్చరించారు. మిరుదొడ్డిలోని పీఏసీఎస్, చెప్యాలలోని డీసీఎంఎస్ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. రెండు కేంద్రాలకు సరఫరా అయిన 40 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, రసాయన ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి పీఏసీఎస్ సీఈఓ రాజు, ఏఈఓలు అఖిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియాతో రైతులకు మేలు

బెజ్జంకి(సిద్దిపేట): నానో యూరియా, డీఏపీ వినియోగించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఏఓ సంతోష్ అన్నారు. మండలంలోని కల్లెపెల్లిలో సోమవారం పత్తి పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ యూరియాను మోతాదుకు మించి వాడితే చీడపీడల ఉధృతి కూడా పెరుగుతుందన్నారు. నానో యూరియా ద్రవ రూపంలో తక్కువ ధరకే లభిస్తుందని తెలిపారు. వర్షాల కారణంగా పత్తి చేనులో నీరు నిలిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి చెట్టు మొదళ్లలో పోయాలని చెప్పారు.అనంతరం బెజ్జంకి, కల్లెపెల్లి గ్రామా లలోని ఫ్యాక్స్, ఎరువుల దుకాణాలను తనిఖీచేసి యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించారు.



బెజ్జంకి(సిద్దిపేట): కల్లెపెల్లిలో పత్తిచేను పరిశీలిస్తున్న ఏఓ సంతోష్



అలిరాజీపేటలో పత్తిని పరిశీలిస్తున్న ఏఓ వసంతరావు

#### వినియోగం పెంచాలి

తొగుట(దుబ్బాక): నానో యూరియా వినియోగాన్ని పెంచేలా డీలర్లు కృషి చేయాలని దుబ్బాక ఏడీఏ మల్లయ్య కోరారు. స్థానిక రైతు వేదికలో ఎరువుల డీలర్లకు నానో యూరియాపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీలర్లు నానో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసిన వెంటనే బిల్లులు ఇవ్వాలని, స్టాక్ బోర్డు ఏర్పాటు చేసుకోవాల సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ మోహన్ పాల్గొన్నారు.

#### పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ వసంతరావు సూచించారు. మండలంలోని అలిరాజ్‌పేటలోని పలువురి పత్తి పంటలను సోమవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం పంట శాఖీయదశ నుంచి గూడదశలో ఉందన్నారు. అక్కడక్కడ పారవిల్ట్ కనిపిస్తుందని, దీని వల్ల మొక్కల ఆకులు ఎండిపోయినట్లు కనిపిస్తాయని వివరించారు. నివారణకు పొలంలో ఉన్న నీటిని బయటకు పంపించాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని చెప్పారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ప్రతాప్‌రెడ్డి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణకేంద్రంలోని పదో వార్డుకు చెందిన పలు పార్టీల నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, వార్డు ఇన్‌చార్జి చింతల మల్లేశం ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చేర్యాలలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని, పార్టీలో చేరిన యువత అందుకు కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తూ స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు చంద్రయ్య, లక్ష్మీనారాయణ, నరేందర్, సతీశ్, రాకేశ్‌కృష్ణన్, నాని, సన్ని, సదానందం ఖలీం పాష, అరవింద్, హరీశ్, భాను, ప్రసాద్, రాజేశ్, అరవింద్, సోను, హర్షవర్ధన్, బాలరాజ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మల్లన్న ఆలయంలో వేలం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఎల్లమ్మ ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్ విక్రయించే హక్కు కోసం ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సోమవారం వేలంపాట నిర్వహించారు. అయినాపూర్‌కు చెందిన మల్లం శ్రీనివాస్ టెండర్‌ను దక్కించుకున్నట్లు ఆమె తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీరాములు, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

### పాడిగేదెల అపహరణ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గౌరయపల్లిలో సోమవారం నాలుగు పాడిగేదెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామానికి చెందిన నీల నర్సింహులు ఆదివారం రాత్రి తన పొలం వద్ద గేదెలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వెళ్లి చూసే సరికి గేదెలు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ రాజు తెలిపారు.

### ఆదర్శలో ప్రవేశాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సతీశ్ తెలిపారు. 1వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

# బీటీ రోడ్డు నిర్మించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామ వేముల పోచమ్మ దేవాలయం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతూ సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లానేత అందె అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య మాట్లాడుతూ పోచమ్మ దేవాలయానికి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తారన్నారు. అలాంటి ఆలయం వరకు మట్టి రోడ్డు ఉండడంతో వర్షం పడితే రోడ్డు బురదగా మారి భక్తులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆలయం వరకు బీటీరోడ్డు మంజూరు చేయించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారని చెప్పారు. నాయకులు భద్రయ్య, ప్రభాకర్, రాజు, కుమార్, నర్సిరెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ భూములు అన్యాక్రాంతం

హిందు ధార్మిక సంఘం నాయకుడు మల్లేశం యాదవ్



మాట్లాడుతున్న మల్లేశం యాదవ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మోహినిపుర వెంకటేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని సిద్దిపేట హిందు ధార్మిక సంఘాల నాయకుడు ఉడుత మల్లేశం యాదవ్ ఆరోపించారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆలయంలో గతంలో ఆర్చీఓగా విధులు నిర్వహించిన వెంకట నరసయ్య ఐదెకరాలు అసైన్డ్ భూమిని తన వంశస్థులే శాశ్వత చైర్మన్‌గా ఉండేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. కానీ ఆలయం మాత్రం సిద్దిపేట ప్రజల సహకారంతోనే నిర్మాణం జరిగిందన్నారు. ఐదెకరాల స్థలం ఒక సంవత్సరం మాత్రమే ఆలయం పేరు మీద ఉండి తదనంతరం ఆ భూమిలో నాలుగెకరాలు తన కుమారుల పేరు మీద మార్చారని ఆరోపించారు. చివరకు ఆలయం పేరు మీద ఒక్క ఎకరం మాత్రమే మిగిల్చారని వాపోయారు. నాటి నుంచి నేటి వరకు ఒక్క వంశంవారే గుడి చైర్మన్‌గా ఉంటున్నారన్నారు. ఆలయ భూములు అన్యాక్రాంతం విషయంపై అధికారులు, గవర్నర్‌కు, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

# ఏసీ రెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం



ఏసీరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు జనగామ మాజీ ఎమ్మెల్యే ఏసీ రెడ్డి నర్సింహారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం నర్సింహారెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏసీ రెడ్డి నాడు భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి వేలాది ఎకరాల భూములను పేదలకు పంచారని కొనియాడారు. మల్లేశం, ఎల్లయ్య, రవీందర్, భరత్‌కుమార్, రాకేశ్ పాల్గొన్నారు.

# భవిష్యత్ ముద్దు సోషల్ మీడియా వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులు భవిష్యత్‌ను లక్ష్యంగా పెట్టుకుని విద్యను అభ్యసించాలని, సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలని ఎస్ఐ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం జగదేవ్‌పూర్‌లో కేజీబీవీ పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వివిధ చట్టాలు, అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య ఒకటే మార్గమని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, ఏఎస్ఐ రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మొక్కలు సంరక్షించడం అందరి బాధ్యత

ఎస్ఐ కీర్తిరాజు



దుబ్బాకరూరల్: మొక్కలు నాటుతున్న ఎస్ఐ కీర్తిరాజు తదితరులు



చిన్నకోడూరులో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

దుబ్బాకరూరల్: వనమహోత్సవంలో భాగంగా మండలంలోని పెద్దగుండవెల్లిలో ఎస్ఐ కీర్తిరాజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు వాటిని రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని చెప్పారు.ప్రతి ఒక్కరు విధిగా ఐదు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అదే విధంగా గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్ ఆయనకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లుగారి ప్రేమ్, కార్యదర్శి యాదగిరి, పరశురాములు, శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

#### ఐదు మొక్కలు నాటాలి

హుస్నాబాద్‌రూరల్: స్వశక్తి మహిళలు వనమహోత్సవంలో పాల్గొని ఇంటింటికీ ఐదు మొక్కలు నాటాలని ఏపీఎం భిక్షపతి సూచించారు. పోతారం (ఎస్) గ్రామంలో స్వశక్తి మహిళలతో కలిసి వనమహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు ఆహ్లాదకరంగా ఉండాలంటే ఇంటి ఎదుట మొక్కలు నాటుకోవాలన్నారు. మునగ, జామ, నిమ్మ, కరివేప, తులసి మొక్కలు నాటితే అవి మన ఆరోగ్యానికి ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు రవీందర్, సీఏ కనకతార తదితరులు పాల్గొన్నారు.

#### మొక్కలతోనే మనుగడ

చిన్నకోడూరు(సిద్దిపేట): చెట్లను పెంచడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏపీఎం ఆంజనేయులు అన్నారు. సోమవారం చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఏపీఓ స్రవంతి, సీసీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

### యువకుడికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): బోరు బండి వాహనం ఢీకొని యువకుడి కాలు తెగిపడిన ఘటన మండల పరిధిలోని పెద్దకోడూరు సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన వర్కోలు రంజిత్ సెంట్రింగ్ కూలీగా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో గ్రామంలోని దర్గావద్ద మూలమలుపు వద్ద సిద్దిపేట నుంచి చిన్నకోడూరు వెళ్తున్న బోరుబండి వాహనం రంజిత్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రంజిత్ కాలు అక్కడే తెగిపడిపోయింది. వెంటనే స్థానికులు 108లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.